అబద్ధాల రంగనాథ్..!

మొదటిపేజీ తరువాయి...

వివరణ ఇవ్వలేదు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆయన ప్రకటనలు, వైఖరి విచిత్రంగా ఉన్నాయి.

పరిధి దాటి అడుగులు

రేవంత్ సర్కారు హైడ్రా ఏర్పాటు చేసి, దాని పరిధిని నిర్ణయిస్తూ ఆగస్టు 19న జీవో 99 జారీచేసింది. కానీ దానికి ఒకరోజు ముందుగానే హైడ్రా నార్సింగి మున్సిపాలిటీ తోపాటు అవుటర్ రింగురోడ్డు దాటి గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ పలు నిర్మాణాలను కూల్చివేసింది. ఇందులో ఓఆర్ఆర్ అవతలి ఖానాపూర్ గ్రామం కూడా ఉంది. అయితే ఈ గ్రామం ఓఆర్ఆర్ లోపల ఉన్న నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుంది కాబట్టి దానిపై తమ అధికారం చెల్లుతుందని రంగనాథ్ వివరణ ఇచ్చారు. కానీ అదేరోజు ఓఆర్ఆర్ లోపల ఉన్న ఏ మున్సిపాలిటీ తోనూ సంబంధంలేని గ్రామపంచాయతీలు హిమాయత్‌నగర్, దాని పరిధిలోని అప్పోజీగూడ, చిలుకూరు గ్రామపంచాయతీ పరిధుల్లోని కూడా పలు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ గ్రామాలలోకి హైడ్రా ఎందుకు వెళ్లిందనే దానిపై ఇప్పటివరకు కమిషనర్ వివరణ ఇవ్వలేదు. కేవలం ఒక పారిశ్రామికవేత్త నిర్మాణాలను కూల్చివేసేందుకే హైడ్రా ఆ గ్రామాలలోకి వెళ్లిందనేది బహిరంగ రహస్యం.

జన్వాడపై జీవోకు విరుద్ధంగా వ్యాఖ్యలు

జీవో 99 ప్రకారం హైడ్రా పరిధి 2053.44 చదరపు కిలోమీటర్లు. ఇందులో జీహెచ్ఎంసీతోపాటు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా, టీఎస్ఐఐసీ, ఐలాతో సహా 61 పారిశ్రామిక ప్రాంతాలు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల్లో జన్వాడ (నంబర్ 32) కూడా ఉంది. కానీ హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాత్రం జన్వాడ తన పరిధిలోకి రాదంటారు. ఇదేమంటే.. అది 111 జీవో పరిధిలో ఉన్నందున, హైడ్రాకు సంబంధం లేదంటారు. మరి 111 జీవో పరిధిలో ఉన్న ఖానాపూర్ గ్రామంలో హైడ్రా ఆగస్టు 18న ఎందుకు కూల్చివేతలు చేపట్టింది? చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ, దాని పరిధిలోని అప్పోజీగూడలో కూడా అదే రోజు కూల్చివేతలు జరిగాయి. మరి ఇక్కడ 99 జీవో ప్రామాణికమా? 111 జీవో ప్రామాణికమా? రంగనాథ్ సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది.

111 జీవోపై మారిన హైడ్రా వైఖరి

వాస్తవానికి హైడ్రా తొలుత 111 జీవో పరిధిని పట్టించుకోలేదు. అందుకే ఖానాపూర్, అప్పోజీగూడల్లో కూల్చివేతలు చేపట్టింది. కారణం దాని లక్ష్యం జన్వాడ. ఈ క్రమంలోనే జన్వాడలోని ఫాంహౌజ్ ముందు రెండు, మూడు రోజులపాటు హైడ్రామా నడిచింది. నీటిపారుదల శాఖ అధికారులు ఫాంహౌజ్ ముందున్న బుల్వాపూర్ నాలాను సర్వే చేశారు. ప్రహరీగోడ మినహా మిగిలిన నిర్మాణం అంతా నిబంధనల మేరకే ఉందని తేలింది. ఆ సమయంలో చేవెళ్లలో ఒక కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 'హైడ్రా 111 జీవో పరిధిలో ఉన్న ఒక్క నిర్మాణం జోలికి కూడా రాదు.. ఇది నా హామీ' అని చెప్పారు. దీంతో జన్వాడ ఎపిసోడ్ పక్కకు పోయింది. అప్పటినుంచి 111 జీవో తమ పరిధిలోకి రాదంటూ హైడ్రా కమిషనర్ ప్రకటించడం మొదలుపెట్టారు. గతంలో 111 జీవో పరిధిలో నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా ఆ తర్వాత వైఖరి ఎందుకు మార్చుకుంది?

అన్నకు అన్నిరకాల అండా..దండ

మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌కు నీటిపారుదల శాఖ నోటీసులు ఇవ్వగా.. హైడ్రా కూల్చేసింది. దుర్గంచెరువు, సున్నంచెరువు పరిధిలో రెవెన్యూశాఖ నోటీసులు ఇచ్చింది. హస్మత్‌పేట పరిధిలో నీటిపారుదలశాఖ నోటీసులు ఇచ్చింది. కూకట్‌పల్లి నల్లచెరువు పరిధిలో జీహెచ్ఎంసీ ఇచ్చింది. వీటిల్లో సున్నంచెరువు, నల్లచెరువు పరిధిల్లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. కానీ దుర్గంచెరువు పరిధిలో నెల రోజుల గడువు ఇచ్చి.. నెలన్నర గడిచినా అటువైపు రెవెన్యూశాఖ, హైడ్రా కన్నెత్తి చూడలేదు. దుర్గంచెరువులో సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి నివాసం కూడా ఉంది. అందుకే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే దాకా అందరూ మౌనం వహించారు. మరి ఇదేం ద్వంద్వ వైఖరి?

ఒవైపీ వంతు రాగానే నాలుక మడత...

ఓ రాజకీయ లక్ష్యంతో ఆదిలో దూకుడు ప్రదర్శించిన హైడ్రా.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యా సంస్థలపైనా గురి పెట్టింది. ఈ మేరకు పలు శాఖల నుంచి వాటికి నోటీసులు కూడా అందాయి. ఇక రేపో మాపో బుల్డోజర్లు దించుతారని అనుకుంటుండగా.. అనూహ్యంగా తెరపైకి ఒవైసీలకు చెందిన ఫాతిమా కాలేజీ వచ్చింది. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్‌లో యథేచ్ఛగా కాలేజీ నిర్మించిన చిత్రాలు జనబాహుళ్యంలో వైరల్ అయ్యాయి. ఆ కాలేజీని కూల్చే దమ్ముందా? అన్న సవాళ్లు పెరిగాయి. ఎక్కడ ఇరుకున పడతామోనని భావించిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా సంస్థలకు సమయం ఇస్తామని ప్రకటించారు. దానిని అందిపుచ్చుకున్న రంగనాథ్ కూడా విద్యా సంస్థల జోలికి ఇప్పుడే వెళ్లమని చెప్పారు. మల్లారెడ్డి, పల్లా కాలేజీల విషయంలో గుర్తుకురాని విద్యార్థుల భవిష్యత్తు ఒవైసీ కాలేజీ విషయంలోనే ఎందుకు గుర్తొచ్చింది?

జీవో వేరు.. మ్యాపు వేరా?

గత కొన్నిరోజుల నుంచి హైడ్రా కమిషనర్ తమ పరిధిపై మళ్లీ తడబాటు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో అలవోకగా అబద్ధాలతో కూడిన లాజిక్‌లు వల్లిస్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం చెరువు ప్రస్తావన వచ్చినపుడు.. అసలు హైడ్రా అక్కడికి వెళ్లలేదన్నారు. కానీ చెరువును పరిశీలించిన వారిలో హైడ్రా అధికారులు కూడా ఉన్నారు. హెచ్ఎండీఏలో శంషాబాద్ జోన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉండి, హైడ్రాకు బదిలీ అయిన రాంరెడ్డి, హైడ్రాలో పని చేస్తున్న ఆర్ఎఫ్ఓ పాపయ్య అక్కడికి వెళ్లారు. మరోసారి ఇబ్రహీంపట్నంపై ఇంకో లాజిక్ వినిపించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అనేది మ్యాపు ప్రకారం హైడ్రా పరిధిలోకి వస్తుందన్నారు. అంటే 99 జీవోలో స్పష్టంగా హైడ్రా పరిధి పేర్కొన్నారు. దీని ప్రకారం ఇబ్రహీంపట్నం చెరువు అవుటర్ అవతల 7-8 కిలోమీటర్ల దూరంలో ఉంది. మరి.. కమిషనర్ రంగనాథ్ చెప్పే మ్యాపు ఏమిటో? దానిని అధికారికంగా ఇప్పటివరకు ఎందుకు విడుదల చేయలేదు? జీవో 99కి భిన్నంగా మ్యాపులో హైడ్రా పరిధి ఉందా? వీటన్నింటికీ సమాధానం చెప్పేదెవరు?!

పూటకో లాజిక్

ప్రజలు నివాసమున్న నిర్మాణాల జోలికి వెళ్లబోమని సాక్షాత్తు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సెలవిచ్చారు. కానీ మాదాపూర్ పరిధిలోని సున్నంచెరువు, మల్లంపేట పరిధిలోని కత్వా చెరువు పరిధిలో జనం నివాసమున్న నిర్మాణాలను కూల్చివేశారు. ఇదేమంటే.. సున్నం చెరువు పరిధిలోని వారు వ్యాపారం చేస్తున్నారని, కత్వా చెరువు పరిధిలో రాత్రికి రాత్రి గృహ ప్రవేశాలు జరిగాయని సెలవిచ్చారు. వాస్తవానికి సున్నంచెరువు పరిధిలో నిరుపేదలు నివసిస్తున్న ఇండ్లు ఉన్నాయి. సంగారెడ్డి పరిధిలోని అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేటల్లో కూడా కొన్నేండ్ల నుంచి నివాసం ఉంటున్న వారి ఇండ్లు కూల్చేశారు.

మూసీతో ఎందుకు సంబంధం ఉండదు?

ఓఆర్ఆర్‌కు ఈవల ఉన్నదంతా హైడ్రా పరిధియేనని జీవో 99లో పేర్కొన్నారు. కానీ హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రవహిస్తుతన్న మూసీ నది పరిసరాలు తన పరిధిలోకి రావని హైడ్రా కమిషనర్ చెప్తున్నారు. దాని ప్రత్యేకంగా ఎంఆర్‌డీసీఎల్ (మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఉంది అని అంటున్నారు. ఔటర్ వరకు ఉన్న నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే హైడ్రా ధ్యేయమైనప్పుడు మూసీ హైడ్రా పరిధిలోకి ఎందుకు రాదు? నగరంలోని చెరువులకు ప్రత్యేకంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఉన్నాయి. గండిపేటకు సంబంధించి ప్రత్యేకంగా జలమండలి, నీటిపారుదల శాఖ ఉన్నాయి. ఈ శాఖలు, విభాగాలన్నింటి అధికారాలు హైడ్రాకు బదిలీ అయినపుడు ఎంఆర్‌డీసీఎల్‌కు ప్రత్యేకంగా అధికారాలు మిగిలి ఉన్నాయా? ఉంటే ఆ విషయాన్ని జీవో 99లో ప్రభుత్వం పేర్కొనాలి కదా? మూసీ పరిధిలో కూల్చివేతలన్నీ రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. హైడ్రా కూడా రెవెన్యూ శాఖ నోటీసులిచ్చిన ప్రాంతాల్లోనే కూల్చివేతలు చేపడుతున్నది. మూసీ విషయంలో మాత్రం హైడ్రా ఎందుకు తప్పించుకుంటుంది? ఆస్తుల పరిరక్షణకే హైడ్రా ఉన్నపుడు మూసీ ఎందుకు మినహాయింపు? దీని వెనక మతలబు ఏంది?

మూసీ బ్యూటిఫికేషన్ రెండేండ్ల తర్వాతే!

- కూల్చివేతల వరకు ఆగాల్సిందే
- భూముల స్వాధీనమే సవాలు
- భూమి లెక్కతోనే మాస్టర్‌ప్లాన్
- స్పష్టం చేసిన ఎంఆర్‌డీసీఎల్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ కోసం అక్రమనిర్మాణాల పేరిట పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశ్రయులుగా మారుస్తుంటే.. ఆ భూములను స్వాధీనం చేసుకునే వరకు పనులు మొదలుపెట్టకూడదనే యోచనలో అధికారులు ఉన్నారు. భూముల స్వాధీనం చేసుకున్న తర్వాతే పనులు మొదలవుతాయని, అప్పటివరకు కనీసం కాగితాలపై కూడా ప్రణాళికలు రూపొందించే ఆలోచనేలేదని తెలిసింది. దీనిని బట్టి మూసీ సుందరీకరణ మొదలు కావాలంటే మరో రెండేండ్లు ఆగాల్సిందే.

స్వాధీనమే అసలు సమస్య

మూసీ ప్రక్షాళన పర్వంలో 45 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్, మతపరమైన స్థలాలను స్వాధీనం చేసుకోవడమే పెద్ద సవాలుగా మారనున్నది. ఇప్పటికే రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాల గుర్తింపుతో హైదరాబాద్ అల్లకల్లోలమైంది. ప్రాథమికంగా 16వేల నిర్మాణాలు అని చెప్పినా... మార్కింగ్ తర్వాత ఆ సంఖ్య 40వేలకు పైనే ఉందని అంచనాకు వచ్చారు. ఎఫ్ఆర్ఎల్ పేరిట గీసిన గీతలతో మూసీలో కొట్టుకుపోయే నిర్మాణాలు లక్షన్నరపైనే ఉంటుందనే వెల్లడైంది. ఇక బఫర్ జోన్ పరిధి కూడా నిర్ధారణ జరిగితే ఈ సంఖ్య మరో రెండు లక్షలు దాటే అవకాశం ఉందని మూసీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఈ లెక్కన ప్రభుత్వ భూముల్లో నివాసితులుగా ఉన్న వారి తరలింపు సులభంగానే జరిగింది.కానీ పట్టా భూములు, అన్ని అనుమతులతో చేపట్టిన లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసుకుని, అధికారిక అప్రూవ్డుమెంట్లలో ఉంటున్న వారిని ఆస్తుల స్వాధీనం సాధ్యమయ్యే పని కాదు. ఇప్పటికే జనాలు తమ నివాసాలను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో మూసీ ప్రక్షాళన మరింత జాప్యం కానున్నది. అయినా భూములు స్వాధీనం తర్వాతే మూసీ బ్యూటీఫికేషన్ పనులు చేపట్టాలని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు భావిస్తున్నారు.

ఎవ్వరడ్డుపడినా 'మూసీ' ఆగదు

- పేదలకు ప్రత్యామ్నాయం ఏం చేద్దామో చెప్పండి
- నిర్వాసితులకు ఇండ్లు కట్టి అందిస్తాం: సీఎం రేవంత్
- శిల్పకళా వేదికలో ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): మూసీ మురికిని ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నామని,ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఆగబోదని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టుల్లో భూసేకరణ తప్పనిసరి అని, ప్రతిపక్షాలు రాజకీయం చేయకుండా నిర్వాసితులకు ఏం చేయాలో సలహాలివ్వాలని అన్నారు. ఆదివారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో వివిధ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అగ్రికల్చర్ ఆఫీసర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, లైబ్రేరియన్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ ఉద్యోగాలకు ఎంపికైన 1,635 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగ నియామక పత్రాలు అందించటం సంతోషంగా ఉన్నదని, ఏండ్లుగా నిరీక్షించిన అభ్యర్థుల కలసాకారమవుతున్నదని తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి అద్భుత కట్టడాలను కట్టిన ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకోవాలని, ఉద్యోగంలో చేరింది మొదలు విరమణ వరకు ఒకేవిధంగా వ్యవహరించాలని సూచించారు. అక్టోబర్ 9న 11,063 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించబోతున్నామని సీఎం వెల్లడించారు.

మూసీ ప్రక్షాళన ఆగబోదు

మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు మూసీ కంపులోనే బతకాలా? అని సీఎం ప్రశ్నించారు. మూసీ పరివాహాక ప్రజలకు ఇండ్లు కట్టించి వారికి మంచి భవిష్యత్తును అందిద్దామని తెలిపారు. ప్రతిదానికి అడ్డుపడకుండా, మూసీ బాధితులను ఎలా ఆదుకోవాలనే అంశంపై సలహాలివ్వాలని ప్రతిపక్ష నేతలను కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కే కేశవరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితుల జీవనోపాధికి కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): మూసీ నిర్వాసితుల జీవనోపాధికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా సెర్ప్ సీఈవో, వైస్ చైర్‌పర్సన్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్, ఎంఆర్‌డీసీఎల్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌తో కూడిన 14మంది సభ్యులను కమిటీలో నియమించింది. పునరావాస ప్రాంతాలకు వచ్చిన నిర్వాసితులకు ఈ కమిటీ జీవనోపాధి కల్పించనున్నది. అంతేకాకుండా నిర్వాసితులను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో వచ్చే సమస్యలు,పరిష్కారాలపై కమిటీ అధ్యయనం చేసి 30రోజుల్లో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

లక్షన్నర కోట్ల మతలబేంటి?

- మూసీ బడ్జెట్‌పై పోరాటం
- సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖలో ఎంపీ ఈటల

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు లక్షన్నర కోట్ల బడ్జెట్‌లో మతలబేంటో తెలిసేదాకా ప్రతిఘటన తప్పదని, ఇప్పటికైనా అఖిలపక్ష సమావేశం పెట్టాలని, వచ్చేందుకు తాము సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ లేఖరాశారు. హైడ్రా సంస్థకు, మూసీ ప్రక్షాళనకు తాను వ్యతిరేకం కాదని వెల్లడించారు. అయితే హైదరాబాద్‌లోని చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించకుండా, 40 ఏండ్ల కింద ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, అనుమతించిన లే అవుట్లలో ఇల్లు కట్టుకున్న పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ అడ్డగోలు కూల్చివేతలు చేపట్టడాన్నే వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. పట్టాభూముల్లో ఇల్లు కట్టుకొని ఉంటున్న వారిని బఫర్‌జోన్ పేరుతో అక్రమంగా కట్టుకొని ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బ్యూటిఫికేషన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తావా ? అంటూ నిలదీశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారించకుండా కూల్చివేత లు ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. సర్కార్ తీరుతో హైదరాబాద్ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నదని విమర్శించారు.

మూసీ సర్వే అంతా మాయ!

- సర్వేలు చేయకుండానే ప్రభుత్వ భూములంటూ రికార్డులు
- ప్రభుత్వ శాఖల ఎన్వోసీలకూ విలువలేదా?
- 1968 నుంచి ఉంటే కబ్జాదారులం అవుతామా?
- సర్వేలు చేయకుండా ఎలా మార్కింగ్ చేస్తారు?
- చైతన్యపురిలోని మారుతీనగర్ వాసుల ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో/ఎల్బీనగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): 'మా జోలికి వస్తే ఊరుకునేదే లేదు' అని తెగేసి చెప్తున్నారు మూసీ బాధితులు. చైతన్యపురిలోని సత్యనగర్, మారుతీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరి కాలనీ.. ఇలా తొమ్మిది కాలనీల్లో అందరి నోటా ఇదే మాట. తామెవరం కబ్జాదారులం కాదని, తమ ఏరియాను సర్వే చేసిన మ్యాప్స్ ఒక్కో శాఖది ఒక్కో మాదిరి ఉందంటూ మ్యాప్స్ చూపిస్తున్నారు. ముఖ్యంగా ఈ కాలనీలన్నీ మూసీ నుంచి సుమారు 23 నుంచి 25 ఫీట్ల ఎత్తులో ఉన్నాయి. తమకు ల్యాండ్ వచ్చిన లింక్ డాక్యుమెంట్స్, హుడా అప్రూవల్ లెటర్స్, రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నుంచి ఇచ్చిన ఈసీ, హుడా రెసిడెన్షియల్ సర్టిఫికెట్, లీగల్ ఒపీనియన్స్.. ఇవన్నీ ఇరవై, ముప్పై ఏండ్ల కిందటివి అని చూపిస్తూ, ఇంతకంటే ఇంకేం కావాలి? అని ప్రశ్నిస్తున్నారు. గూగుల్ మ్యాపులు చూస్తుంటే లంగర్‌హౌజ్ నుంచి నాగోల్ వరకు బఫర్‌జోన్, ఎఫ్టీఎల్, రివర్‌బెడ్ ఎంత తేడాగా కనిపిస్తుందో చూడాలని చెప్తున్నారు. చైతన్యపురి జోన్‌కు వచ్చేసరికి వెడల్పు పెంచారని, మిగతాచోట్ల సన్నగా ఉంచడం ఎంతవరకు కరెక్ట్? అని మూసీ అలైన్‌మెంటే సరిగా లేదని, నదీపారకంపై శాస్త్రీయంగా సర్వే జరగలేదని ఆరోపిస్తున్నారు.

50 ఏండ్ల కిందట మారుతీనగర్ లేఔట్

'చైతన్యపురిలోని మారుతీనగర్ లేఔట్ చేసి 48 ఏండ్లైంది. సర్వే నంబర్ 78/2లో 1.08 గుంటల భూమిలో మారుతీనగర్ పేరుతో కొత్తపేట విలేజ్, నాగోల్ గ్రామపంచాయతీ, హయత్‌నగర్ తాలూకా, రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటుచేశారు. ఈ లేఔట్ చేయడానికి కావలసిన లింక్ డాక్యుమెంట్స్ కూడా 1968 నుంచి ఉన్నాయి. వీటితో లీగల్ ఒపీనియన్ కూడా తీసుకున్నారు. హుడా ఈ ప్రాంతాన్ని రెసిడెన్షియల్‌గా అప్రూవల్ చేస్తూ సర్టిఫికెట్ ఇచ్చింది. సబ్‌రిజిస్ట్రార్ కూడా దీనికి సంబంధించిన సర్టిఫికెట్ ఇచ్చారు. పహాణీల్లోనూ ఈ ల్యాండ్‌ను డ్రై , పట్టా భూములుగా పేర్కొన్నారు. ఇవన్నీ కొత్తగా తీసుకున్న సర్టిఫికెట్లు కావు. ఈ సర్టిఫికెట్లు అన్నీ అధికారులు ఇచ్చినవేగా!' అని స్థానికులు చెప్తున్నారు.

గతంలో నామమాత్రంగా సర్వే

'కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఏప్రిల్ 2013లో రంగారెడ్డి జిల్లా అధికారులు ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల్లో లోపాలు సవరించడానికి సర్వే చేశారు. అయితే ఈ సర్వేను సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులు చేయాలని జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో కమిటీ నియమించారు. సుమారు పది వేల సర్వే నంబర్లలో తేడాలున్నాయని, వీటిని గుర్తించి తప్పులు సరిదిద్దడానికి కమిటీ కార్యాచరణ చేపట్టింది. కానీ అప్పటి పరిస్థితుల కారణంగా సర్వే చేయకుండానే.. తప్పులనే తిరిగి సైట్‌లో నమోదు చేశారు. దీంతో పట్టా భూములేవి? ప్రభుత్వ భూములేవి? అనే విషయంలో సరైన సర్వే జరగకపోవడం వల్ల ఇప్పుడు కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సర్వే చేసి రికార్డుల పరిశీలనతో శాస్త్రీయ విధానంలో తప్పులు సరిదిద్దాలి' అని మారుతీనగర్ వాసులు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ, ధరణి మ్యాపుల్లో తేడాలు

మారుతీనగర్ మ్యాపులు ప్రభుత్వశాఖల్లో ఒక్కోదగ్గర ఒక్కోలా కనిపిస్తున్నదని తెలుస్తున్నది. 78/2 సర్వే నంబర్ మ్యాప్‌ను పరిశీలిస్తే ధరణిలో ఒకలా, జీహెచ్ఎంసీలో మరోలా, హెచ్ఎండీఏలో ఇంకోలా ఉన్నాయి. మారుతీనగర్, సత్యనగర్‌లో ఉన్న కొన్ని ఇండ్లు ఒక మ్యాపులో ఎఫ్‌టీఎల్ బయట, మరోమ్యాపులో ఎఫ్‌టీఎల్ లోపల కనిపిస్తున్నాయి. శాస్త్రీయతే లేకుండా మ్యాపింగ్ చేశారని, ఇప్పటివరకు సరైన మ్యాపులు లేకపోవటం వల్ల చాలా సమస్యలు వస్తున్నాయని అధికారులే అనధికారికంగా చెప్తున్న పరిస్థితి. 'మార్కింగ్ సమయంలో మార్కింగ్ ఎలా చేస్తున్నారని తాము అడిగితే.. తమ వద్ద ఉన్న రికార్డులను బట్టి చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరి మా దగ్గర ఉన్న డాక్యుమెంట్స్ పరిస్థితి ఏమిటి? అని అడిగితే మాకేం తెలియదు అని వారు అంటున్నారు. డాక్యుమెంట్లు చూపించేందుకు వెళ్తే పట్టించుకోవటం లేదు. సరైన విధానంలో సర్వే చేసి ప్రజల ముందు పెట్టి ఆ తర్వాత మూసీ రివర్‌బెడ్, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల హద్దులను నిర్ణయించాలి' అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సుందరీకరణ అంటే రోడ్డున పడేయడమా

మూసీ నుంచి 23 ఫీట్ల పైన ఉన్నం. ఇప్పటి వరకు ఒక్క చుక్క నీరు కూడా మా దగ్గరకు రాలేదు. మూసీ వరదలతో హైదరాబాద్ మునిగిన తర్వాతే మా కాలనీలోకి నీళ్లు వస్తాయి. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ అన్నారు.. కానీ మా బతుకులను రోడ్డుమీద పడేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? అసలు మీ లక్ష్యమేమిటి? ప్రక్షాళన చేయడమంటే మా ఇండ్లను కూల్చేయమని కాదు కదా. అసలు రోడ్డున పడేసే ముందు ఒకసారి ఆలోచించాలి కదా.

- శ్రీదేవి, సత్యనగర్

మూసీ సర్వే జరిగిందా?

అసలు మూసీకి సంబంధించి సర్వే జరిగిందా? సర్వేలు ప్రజల భాగస్వామ్యంతో జరగాలి. అలాకాకుండా మొక్కుబడిగా సర్వే చేసి మమ అనిపిస్తున్నారు. ఇంకో ముఖ్యమైన విషయం సర్వే నంబర్ 78/2 మూసీ రివర్ ఎఫ్టీఎల్‌లో ఉన్నదని చూపిస్తున్నారు. ధరణి, జీహెచ్ఎంసీ మ్యాపులే తేడాగా ఉన్నాయి. ఈ రెండు చూస్తే సరిపోదా. సర్వే శాస్త్రీయంగా చేయకపోగా.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇవేమీ రివర్ బెడ్ కాదు. అసైన్డ్ భూములు కావు. రెండు సార్లు ఇది రెసిడెన్షియల్‌గా వాడుకోవచ్చని హుడా అప్రూవల్ ఇచ్చిన డాక్యుమెంట్లూ ఉన్నాయి.

- ఆశిష్ అగర్వాల్, న్యూమారుతీనగర్

రాత్రిళ్లు నిద్రపట్టడం లేదు

మేం ఇక్కడ 25 ఏండ్ల నుంచి ఉంటున్నాం. మాకెలాంటి మూసీ సమస్య లేదు. మా పిల్లలతో పాటు మూసీతో అనుబంధం పెంచుకున్నం. ఇప్పటివరకు మమ్మల్ని మూసీ ఎప్పుడూ ముంచలేదు. నీటి చుక్క కూడా ఇక్కడికి రాలేదు. మేము పూర్తి ఎత్తులో ఉన్నం. మా దగ్గరికి నీళ్లురానప్పుడు మా జోలికి ఎందుకు వస్తరు? అధికారులు వచ్చి బెదిరిస్తుంటే మాకు నిద్ర పట్టడం లేదు. ఎప్పుడేం జరుగుతుందోనని గుండెలు అదురుతున్నయ్.

- సుగుణమ్మ, సత్యనగర్

సర్వేలు చేయకుండానే చేశామన్నారు

మూసీ రివర్‌బెడ్‌కు సంబంధించి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ అంటూ మ్యాపులు కనిపిస్తున్నాయి. ఇందులో మా ప్రాంతానికి వచ్చే వరకు 160 మీటర్లు తీస్తున్నారు. అదే మిగతా ప్రాంతాల్లో 20 నుంచి 25 మీటర్లే తీస్తున్నారు. ఇదేం అంటే అలాగే ఉంటుందన్నారు. అధికారులను అడిగితే గవర్నమెంట్ ల్యాండ్ అని రికార్డుల్లో ఉంటే మార్కింగ్ చేస్తున్నామని అంటున్నారు తప్ప 2013లో వచ్చిన సర్వే నంబర్లపై ఇప్పటివరకూ తేల్చలేదని అడిగితే సమాధానమే లేదు. సర్వేలు చేయకుండా చేశామని చెప్పుకుంటూ మమ్మల్ని రోడ్డున పడేస్తున్నారు.

- చిట్టిబాబు, మారుతీనగర్

రిలే దీక్షలు చేస్తున్న గిరిజనేతరులు

ఇండ్ల కూల్చివేతపై ఇంద్రవెల్లిలో నిరసనలు

- గిరిజనేతరుల రిలే దీక్షలు
- స్వచ్ఛందంగా దుకాణాల బంద్

ఇంద్రవెల్లి, అక్టోబర్ 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలు కాకముందు నుంచి